క్లుప్తంగా...

పీహెచ్‌డీ ఫీజు పెంపుపై ప్రశ్నిస్తే కక్షసాధింపు చర్యలా?

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పెంచిన పీహెచ్‌డీ ఫీజుల పెంపుపై ప్రశ్నిస్తే కక్షసాధింపు చర్యలా? అని వీసీ ప్రొ.రవీందర్‌ను పరిశోధన విద్యార్థి నెల్లి సత్య శుక్రవారం ఓ ప్రకటనలో ప్రశ్నించారు. పెంచిన ఫీజును తగ్గించాలని రెండు నెలలుగా పోరాడుతున్న తనపై వీసీ కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. పీహెచ్‌డీ పొలిటికల్ సైన్స్ ప్రవేశ పరీక్షలో మొదటి ర్యాంక్ సాధించిన తనకు తొలుత ఓయూ ప్రొఫెసర్ పర్యవేక్షణలో ఆర్ట్స్ కాలేజీలో సీటు లభించగా ఫీజుల పెంపుపై ప్రశ్నిస్తున్నందుకు సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కాలేజీ అధ్యాపకుని పర్యవేక్షణకు బదిలీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలపై పోరాడుతున్న విద్యార్థులపై వ్యక్తిగతంగా కక్ష సాధింపులకు పాల్పడటం దారుణమన్నారు.

ఎయిడెడ్ కాలేజీలను కొనసాగించండి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో కొనసాగుతున్న ఎయిడెడ్ కాలేజీలను కొనసాగించాలని బీఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వేల్పుల సంజయ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఓయూలో మాట్లాడుతూ.. తక్కువ ఫీజుతో పేద విద్యార్థుల ఉన్నత చదవులకు దోహదం చేస్తున్న ఎయిడెడ్ కాలేజీలను మూసివేస్తే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

ఆలయాల అభివృద్ధికి సహకారం



అన్నదానంలో పాల్గొన్న శ్రీగణేశ్, బోర్డు మాజీ సభ్యుదు పాండయాదవ్

కంటోన్మెంట్: ఆలయాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని బీఆర్‌ఎస్ నేత, శ్రీగణేశ్ ఫౌండేషన్ ‌చైర్మన్ శ్రీగణేశ్ అన్నారు. శుక్రవారం బోర్డు మాజీ సభ్యుడు పాండుయాదవ్‌తో కలిసి బోయిన్‌పల్లి చిన్నతోకట్టాలోని కట్టమైసమ్మ ఆలయాన్ని దర్శించుకున్నారు. అమావాస్యను పురస్కరించుకుని ఆలయంలో నిర్వహించిన అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో శరత్, సాయి, పవన్, విక్కీ, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని మహిళ మృతి

సికింద్రాబాద్: పట్టాలు దాటుతున్న క్రమంలో వేగంగా వచ్చిన రైలు ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన శుక్రవారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మౌలాలికి చెందిన దేవమ్మ (55) కూలీపని చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. ఉదయం 7 గంటల ప్రాంతంలో మౌలాలి రైల్వేస్టేషన్ ఎల్‌సీ గేట్ 6వ ట్రాక్ వద్ద పట్టాలు దాటుతుండగా వేగంగా వచ్చిన రైలు ఢీకొట్టడంతో దేవమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

డిక్లరేషన్ పేరుతో బీసీలను మోసం చేస్తున్న పార్టీలు



మాట్లాడుతున్న ప్రొ. గాలి వినోద్‌కుమార్

లాలాపేట: బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు బీసీ డిక్లరేషన్ల పేరుతో మరోసారి బీసీలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని దక్షిణ భారత సమితి కన్వీనర్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 10 ఏళ్లుగా కేంద్రంలో బీసీ ప్రధాని ఉన్నప్పటికీ బీసీ కుల గణన చేయడం గాని, బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయడం గాని, బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు ఇవ్వడం గాని, జనాభా దామాషా ప్రకారం బడ్జెట్ కేటాయించడం కానీ చేయకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. డిసెంబర్‌లో జరిగి ఎన్నికల్లో బీఆర్‌ఎస్ మళ్లీ గెలిస్తే సీఎం కేసీఆర్ తన కుమారుడు కేటీఆర్‌ను ముఖ్యమంత్రిని చేస్తాడే తప్పా బీసీలను కాదని ఆయన విమర్శించారు.

సీఐని నియమించినా ఠాణా సిద్ధం కాలేదు!

- బాధ్యతలు స్వీకరించిన కొత్త ఇన్‌స్పెక్టర్
- ఒకే ఛాంబర్‌లో ఏసీపీ, సీఐ
- వసతుల ఏర్పాటుకు తొలగని సమస్యలు
- ప్రధాన అడ్డంకిగా నైట్ షెల్టర్
- వారాసీగూడ పీస్ ఏర్పాటుకు అన్నీ ఆటంకాలే..



వారాసీగూడ పీఎస్ కోసం కేటాయించిన జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీహాల్ భవనం

సికింద్రాబాద్: నాలుగు నెలల క్రితం వారాసీగూడ పేరుతో కొత్తగా పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు వెలువరించింది. ఉత్తర్వులు వెలువడ్డాక మూడు నెలలకు ఏసీపీ నియామకం జరిగింది. తాజా బదిలీల్లో కొత్తగా ఇన్‌స్పెక్టర్ నియామకం జరిగింది.

- వారాసీగూడ పోలీస్‌స్టేషన్‌తోపాటు, చిలకలగూడ ఏసీపీ కార్యాలయాన్ని బౌద్ధనగర్ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేయాలని అప్పట్లోనే నిర్ణయించినప్పటికీ ఏసీపీ కార్యాలయం ఏర్పాటుతోనే ఏర్పాట్లు నిలిచిపోయాయి. దశాబ్దాల కాలంగా ఓ మోస్తరు వివాహాది శుభకార్యాలు నిర్వహింకునేందుకు నిర్మించిన బౌద్ధనగర్ కమ్యూనిటీహాల్ భవనం పోలీస్‌స్టేషన్, ఏసీపీ కార్యాలయం నిర్వహించుకునేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు అనుమతి ఇచ్చారు.
- మొదటి అంతస్తులో పోలీస్‌స్టేషన్, రెండవ అంతస్తులో అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయం ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసుకున్నారు. రెండవ అంతస్తు ఏర్పాటు కావడంతో ఏసీపీ కార్యాలయం సిద్ధమైంది. మొదటి అంతస్తులో నగరంలో ఉద్యోగాలు చేసుకునే ఒంటరి మహిళలు, అనాథలు బస చేసేందుకు నైట్ షెల్టర్‌ను జీహెచ్‌ఎంసీ సహకారంతో అమన్ వేదిక అధికారులు నిర్వహిస్తున్నారు.

గుదిబండగా నైట్ షెల్టర్..

తమకు మరోచోట వసతి ఏర్పాటు చేస్తే కమ్యూనిటీహాల్‌ను ఖాళీ చేస్తామని నైట్ షెల్టర్ నిర్వహిస్తున్న అమన్ వేదిక ప్రతినిధులు చెబుతున్నారు. దీంతో కమ్యూనిటీహాల్ భవనంలోని మొదటి అంతస్తు నేటికీ పోలీసుల ఆధీనంలోకి రాలేదు. ఫలితంగా వారాసీగూడ పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు నైట్ షెల్టర్ గుదిబండగా మారింది. నెలలు గడుస్తున్నా నైట్ షెల్టర్ కోసం ప్రత్యామ్నాయ వసతి చూపించడంలో ప్రజా ప్రతినిధులు, జీహెచ్‌ఎంసీ అధికారులు నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తుండడంతో పీఎస్ ఏర్పాటు పనుల్లో జాప్యం జరుగుతుందన్న విమర్శలు వస్తున్నాయి.

- సికింద్రాబాద్ ప్రజా ప్రతినిధులు మొదలు, ప్రభుత్వ అధికారులతో పలుమార్లు పోలీసు అధికారులు సమావేశమయ్యారు. కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్తులోని నైట్ షెల్టర్‌ను ఖాళీ చేయించాలని పీఎస్ ఏర్పాటుకు సహకరించాలని కోరారు. అదే విధంగా గ్రౌండ్ ఫ్లోర్‌ను కూడా తమకు అప్పగిస్తే సందర్శకుల కోసం కేటాయించి వసతులు ఏర్పాటు చేసుకోవడానికి వీలు ఉంటుందని అధికారులు కోరుతున్నారు.
- ఇదిలా ఉండగా జూన్ 2వ వారం నుంచి వారాసీగూడ పీఎస్ కార్యకలాపాలు ప్రారంభం అవుతాయని పోలీసు అధికారులు చెబుతున్నారు. నైట్ షెల్టర్‌ను మరో చోటికి తరలించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు.

నేటికీ పోలీసు సిబ్బంది అధికారుల నియామకం జరగకపోవడంతో ఇన్‌స్పెక్టర్ నియామకం జరిగినా మరికొద్ది రోజులు ఖాళీగా ఉండక తప్పని పరిస్థితి నెలకొంది.

అధ్యయనం చేస్తున్నాం..



వారాసీగూడ పీఎస్ కార్యకలాపాలు పూర్తి స్థాయిలో ప్రారంభమయ్యేందుకు మరికొంత సమయం పట్టనున్న నేపథ్యంలో ఈ ప్రాంతాన్ని అధ్యయనం చేయనున్నామని కొత్త ఇన్‌స్పెక్టర్ పి.శంకర్ తెలిపారు. తాజా బదిలీల్లో కుల్సుంపుర పీఎస్ నుంచి ఇన్‌స్పెక్టర్ శంకర్ వారాసీగూడ పీఎస్‌కు బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ కొత్త పీఎస్ ప్రారంభం అయ్యేలోపు తమ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తామన్నారు. ప్రజలతో సమావేశాలు ఏర్పాటు చేసి సమస్యలు తెలుసుకుంటామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం అవసరమైన కార్యాచరణ సిద్ధం చేసుకుంటామన్నారు.

– శంకర్, వారాసీగూడ పీఎస్ కొత్త ఇన్‌స్పెక్టర్

యువత ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలి

కంటోన్మెంట్: యువత ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వాలు పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్, బీఆర్‌ఎస్ సోషల్ మీడియా ఇంచార్జ్ మన్నె క్రిషాంక్ అన్నారు. కంటోన్మెంట్‌లో యువత ఆలోచనలు, ఆకాంక్షలు తెలుసుకునేందుకు 'కేఫ్ పాలిటిక్స్' పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో యువత పెద్ద ఎత్తున గుమిగూడే ప్రాంతాల్లో చాయ్ కేఫ్‌లు కీలకం అన్నారు. కేవలం చాయ్‌తో పాటు సామాజిక, రాజకీయ అంశాలపై చర్చకు ఈ కేంద్రాలు వేదికలుగా ఉంటున్నాయన్నారు. ఈ నేపథ్యంలోనే నేరుగా యువతను కలిసి వర్తమాన రాజకీయాలపై వారి ఆలోచనలు తెలుసుకునేందుకు తమ పార్టీ తరఫున ఈ కార్యక్రమం చేపట్టామన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

లాలాపేటలో స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాలీ

లాలాపేట: స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జీహెచ్‌ఎంసీ శానిటేషన్ సిబ్బంది, మలేరియా సిబ్బందితో కలిసి లాలాపేటలో ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టాలి, రెడ్యూస్ వేస్ట్ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మేరీ లైఫ్ మేరా స్వచ్ఛ షహర్ అంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ సర్కిల్–29 డీఈఈ మాధవి, శానిటరీ సూపర్‌వైజర్ ధనాగౌడ్, ఈఎస్ యమున, శ్రావణ్‌కుమార్, ఎస్‌ఎఫ్‌ఏలు యాకయ్య, దశరథ్, పోచాలు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ మనందరి బాధ్యత

చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ శైలజరావు



ర్యాలీలో పాల్గొన్న సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ శైలజరావు

కవాడిగూడ: బాలల హక్కుల పరిరక్షణ మనందరి బాధ్యత అని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ) చైర్‌పర్సన్ శైలజారావు అన్నారు. ముషీరాబాద్‌లో బాలల హక్కుల పరిరక్షణపై హైదరాబాద్ జిల్లా పీపుల్స్ యాక్షన్ ఫర్ రూలర్, పారా స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... హుజురాబాద్ జిల్లాలోని 40 ప్రభుత్వ పాఠశాలల్లో బాలల సంఘాలను ఏర్పాటు చేసి వారి హక్కులపై అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేలా కృషి చేయడం అభినందనీయమన్నారు. సీడీపీఓ సునంద, బాలల సంరక్షణ జిల్లా అధికారి శ్రీనివాస్‌రెడ్డిలు మాట్లాడుతూ.. బాలలకు ఎలాంటి సమస్య వచ్చిన 1098 ఫోన్‌లో తెలియజేస్తే వాటిపై స్పందించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేందర్‌యాదవ్, జాతీయ యువజన పురస్కార గ్రహీత పానుగంటి మహేష్, నాయకులు అంబేద్కర్, నాగేష్, కిషోర్ తదితరులున్నారు.

ఉద్యోగాల పేరుతో భారీ మోసం



అపాయింట్‌మెంట్ ఆర్డర్ చూపిస్తున్న బాధితులు, వారి కుటుంబ సభ్యులు

పంజగుట్ట: తాను అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధి బావమర్దినని, ఇప్పటికే ఎంతో మందికి ప్రభుత్వ ఉద్యోగాలు పెట్టించాను, మీకు కూడా పెట్టిస్తానని సుమారు 15 మందికి పైగా మోసం చేసిన వ్యక్తి నుంచి తమను కాపాడాలని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బాధితులు వేణుగోపాల్, రాఘవేంద్ర, రమ్య మాట్లాడుతూ.. 2019, 2020 ప్రాంతంలో వారాసిగూడకు చెందిన బి.శ్రీనివాస్‌గౌడ్ తాను సికింద్రాబాద్‌కు చెందిన ఓ ప్రజాప్రతినిధి సమీప బంధువునని ఆయనతో దిగిన ఫొటోలు చూపించి ఉద్యోగాలు పెట్టిస్తానని నమ్మబలికాడు. ఎక్సైజ్ శాఖలో స్టోర్ అసిస్టెంట్, స్టోర్ ఆఫీసర్ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు పడ్డాయని దొంగ నోటిఫికేషన్లు చూపించాడు. ఇది నమ్మిన బాధితులు ఒక్కొక్కరూ రూ.13 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు చెల్లించుకున్నారు. కొద్దిరోజుల తర్వాత వీరికి పోలీస్‌శాఖ లోగో ఉన్న లెటర్‌హెడ్‌పై నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు కూడా ఇచ్చి పూర్తి డబ్బులు వసూలు చేశాడు. ఏమయ్యింది అంటే నేడు, రేపు అంటూ దాటవేస్తున్నాడని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులం కలిసి చిలకలగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశామని పోలీసులు తాము చర్యలు తీసుకుంటాము అన్నారు కాని ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పుడు శ్రీనివాస్‌గౌడ్ వద్దకు వెళ్లి అడిగితే తన ఆరోగ్యం బాగాలేదని, బాగయ్యాక డబ్బులు ఇస్తానని అంటున్నాడని తెలిపారు.

నారాయణగూడ ఇన్‌స్పెక్టర్‌గా గురుశివరామకృష్ణ



హిమాయత్‌నగర్: నారాయణగూడ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ (ఇన్‌స్పెక్టర్)గా మొర్ల గురుశివ రామకృష్ణ (ఎంజీఎస్‌ఆర్) బాధ్యతలు చేపట్టారు. శుక్రవారం సీపీ సీవీ ఆనంద్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలసి చార్జ్ తీసుకున్నారు. 1998వ బ్యాచ్‌కు చెందిన ఆయన సిటీ స్పెషల్ బ్రాంచ్‌లో ఇన్‌స్పెక్టర్‌గా చేశారు. ఇటీవల నగర వ్యాప్తంగా జరిగిన 96 మంది ఇన్‌స్పెక్టర్ల బదిలీల్లో ఎస్‌బీ నుంచి నారాయణగూడకు బదిలీపై వచ్చారు. దాదాపు 27 రోజుల తర్వాత నారాయణగూడకు ఎంజీఎస్‌ఆర్‌ను ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు.

నైపుణ్యంతోనే ఉద్యోగ అవకాశాలు

కాచిగూడ: కష్టపడి పనిచేసేతత్వం భారత్‌లోని యువత సొంతమని ఈ నేపథ్యంలోనే వారంతా ప్రపంచ వ్యాప్తంగా వివిధ సంస్థల్లో ఉన్నత పదవుల్లో కొనసాగుతున్నారని టాస్క్ సీఈఓ శ్రీకాంత్ సిన్హా అన్నారు. 'బంకత్‌లాల్ బద్రుకా కాలేజ్ ఫర్ ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీ ' వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం కాచిగూడలోని బద్రుక కళాశాల ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ.. అవకాశాలను సద్వినియోగం చేసుకొని నూతన ఆవిష్కరణలు చేయాలని సూచించారు. సామాజిక అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు నూతన ఆవిష్కరణల వైపు అడుగులు వేయాలన్నారు. నేటి ప్రపంచంలో అత్యంత ముఖ్యమైన కమ్యూనికేషన్ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని విద్యార్థులను కోరారు. ఆల్‌రౌండ్ టాపర్లకు బంగారు, రజత పతకాలు, సర్టిఫికెట్లను ప్రదానం చేసి జ్ఞాపికలను అందజేశారు. శ్రీలక్ష్మినివాస్‌శర్మ, శ్రీ కిషన్ బద్రుక, రవి బద్రుక, రాజేంద్రకుమార్, ప్రొఫెసర్ అభిరామకృష్ణ, డీశీఎస్ఎస్ మూర్తి, పీవీవీ కార్తీక, సత్యరవళి తదితరులు పాల్గొన్నారు.

వాహనాలకు విధిగా బీమా చేయించాలి



కార్యక్రమంలో పాల్గొన్న ఏసీపీ శంకర్‌రాజు

అమీర్‌పేట: వాహనదారులు తమ వాహనాలకు తప్పనిసరిగా బీమా చేయించాలని బేగంపేట టీటీఐ ఏసీపి శంకర్‌రాజు తెలిపారు.అమీర్‌పేట ఆస్టర్‌ప్రైమ్ ఆసుపత్రిలో శుక్రవారం మోటారు వాహన చట్టం, రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, బీమాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్‌నగర్ ట్రాఫిక్ జ్యోతి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చలో బస్ భవన్

లాలాపేట: టీఎస్ ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం, మేనేజ్‌మెంట్ చొరవ తీసుకోవాలని ఆర్టీసీ బహుజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుద్దాల సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తార్నాకలోని యూనియన్ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రంలో సైతం ఆర్టీసీ కార్మికులకు పే స్కేల్ ఇవ్వడం లేదన్నారు. 2017 నుంచి 2021 వరకు ఉన్న పే స్కేల్ బకాయిలను తక్షణమే చెల్లించాలని కోరుతూ త్వరలో చలో బస్ భవన్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం రోజున నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలపాలని రాష్ట్ర కార్యవర్గం తీర్మానించినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు జీకే స్వామి, బి. శ్రీనివాస్‌గౌడ్, సీహెచ్. రవీందర్, నర్సింహ, సురేఖ తదితరులున్నారు.

బాధ్యతల స్వీకరణ



మట్టం రాజు

సికింద్రాబాద్: చిలకలగూడ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా సరికొండ మట్టంరాజు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవలి ఇన్‌స్పెక్టర్ల బదిలీల్లో ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లిన ఇన్‌స్పెక్టర్ నరేశ్ స్థానంలో సరికొండ మట్టంరాజు నియమితులయ్యారు. 2007 బ్యాచ్‌కు చెందిన మట్టంరాజు నగరంలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించారు. గొల్కొండ పీఎస్ డీఐగా ఉన్న ఆయన బదిలీపై చిలకలగూడ స్టేషన్ హౌజ్ ఆఫీసర్‌గా నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఇన్‌స్పెక్టర్ మట్టంరాజు విలేకర్లతో మాట్లాడుతూ.. చిలకలగూడ పీఎస్ పరిధిలోని అన్ని ప్రాంతాల ప్రజలను సమన్వయం చేసుకుని శాంతిభద్రతలను పరిరక్షిస్తామన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

నల్లకుంట: నల్లకుంట సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ సిటీజన్ల కోసం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్‌రావు, అధ్యక్షుడు పుల్లయ్య, కార్యదర్శి రంగయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈరోజు శంకరమఠ పద్మకాలనీ కమ్యూనిటీహాల్‌లో ఉదయం 10 గంటలకు శిబిరం ప్రారంభమవుతుందన్నారు. ఈ శిబిరంలో ముషీరాబాద్ కేర్ ఆసుపత్రి వైద్యులు వృద్ధులకు బీపీ, షుగర్‌తో పాటు వివిధ రకాల వైద్యపరీక్షలు నిర్వహించి వారికి అవసరం మేరకు వైద్య సలహాలు, సూచనలు ఇస్తారని చెప్పారు. నల్లకుంట, విద్యానగర్, డీడీకాలని, బాగ్‌లింగంపల్లి, అచ్యుతరెడ్డి మార్గ్, అచ్చయ్యనగర్ పరిసర ప్రాంతాల్లోని వృద్ధులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

మున్నూరుకాపు భవన నిర్మాణ కమిటీ చైర్మన్‌గా పురుషోత్తమరావు

పంజగుట్ట: మున్నూరుకాపు ఆత్మగౌరవ భవన నిర్మాణ కమిటీ చైర్మన్‌గా సర్దార్ పుట్టం పురుషోత్తమరావు నియమితులయ్యారు. ఎర్రమంజిల్‌లోని మున్నూరు కాపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ముఖ్యమంత్రి అన్ని కులాలకు ఆత్మగౌరవ భవనాలు కేటాయించారని అందులో భాగంగా మున్నూరు కాపులకు కోకాపేటలో 5 ఎకరాల స్థలం, భవన నిర్మాణానికి రూ. 5 కోట్లను మంజూరు చేశారన్నారు. మున్నూరు కాపు ఫౌండేషన్ ట్రస్ట్ బోర్డు చైర్మన్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మంత్రి గంగుల కమలాకర్ సమక్షంలో తనను నిర్మాణ కమిటీ చైర్మన్‌గా ఎన్నుకున్నారని తెలిపారు. సభ్యులుగా గంగుల సుధాకర్, మెట్టు శ్రీనివాస్, పూల రవీందర్, గాలి అనీల్ కుమార్, మంగళారపు లక్ష్మణ్, రంజిత్ కుమార్, విష్ణు జగతి, బండి సంజీవ్, ఈసంపల్లి వెంకన్న, బండి పద్మ, గోపాల గణేష్, విజయకుమార్, జయపాల్, రామారావు, హనుమంతరావులను ఎంపికచేసినట్లు తెలిపారు. తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయకుండా మున్నూరు కాపు యువతకు, ప్రతి ఒక్కరికీ ఆమోదయోగ్యంగా ఉండే భవనం నిర్మించేందుకు శాయశక్తులా కృషి చేస్తామన్నారు.

ముదిరాజ్‌లకు ప్రభుత్వం చేయూతనివ్వాలి

లిబర్టీ: అన్ని రంగాల్లో వెనుకబడి దయనీయ పరిస్థితుల్లో జీవితాలు వెళ్లదీస్తున్న ముదిరాజ్ కులస్తులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా చేయూత ఇవ్వాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు డి.కుమారస్వామి కోరారు. సంప్రదాయ వృత్తిని నమ్ముకుని బతుకుబండి లాగుతున్నారని తెలిపారు. శుక్రవారం కార్యాలయంలో ముదిరాజ్ చైతన్య వేదిక పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో వెనుకబడి ఉన్న ముదిరాజ్‌లకు ఆర్థిక పరిపుష్టి కల్పించేందుకు రూ. 10 వేల కోట్లతో ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్ర జనాభాలో ముదిరాజ్‌లు అత్యధికంగా ఉన్నారని వారు వృత్తిని జీవనభృతిగా మార్చుకుని దుర్భర జీవితం గడుపుతున్నారని పేర్కొన్నారు. తరతరాలుగా శ్రమను నమ్ముకుని చేపల వృత్తి, పళ్ల అమ్ముకుని జీవనం సాగిస్తున్నారని వారికి ఆర్థికంగా ప్రగతిపథంలో తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

హైకోర్టు స్టే ఇచ్చినా పనులు ఆపరా: కరాటే కళ్యాణి

పంజగుట్ట: ఎన్టీఆర్ రూపంలో శ్రీకృష్ణుడి విగ్రహం ఏర్పాటు పనులు నిలిపివేయాలని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు స్టే ఇచ్చినా ప్రభుత్వం పనులు ఆపకుండా అక్కడ 144 సెక్షన్ పెట్టి మరీ వేగవంతంగా చేయించడం ఎంతవరకు సబబని పలు సంఘాల ప్రతినిధులు ప్రశ్నించారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆదిభట్ల కళాపీఠం వ్యవస్థాపకురాలు కరాటే కళ్యాణి యాదవ్, జై శ్రీకృష్ణ జేఏసీ వ్యవస్థాపకులు ప్రభాకర్ యాదవ్, న్యాయవాది చెలకాని వెంకట్ యాదవ్ మాట్లాడుతూ... గురువారం కోర్టు స్టే ఇచ్చిందని తెలియగానే హైదరాబాద్ నుంచి ఖమ్మంకు విగ్రహాన్ని తరలించారన్నారు. తదుపరి తీర్పు వచ్చేవరకు అక్కడ ఎలాంటి పనులు చేయరాదని హైకోర్టు స్టే ఇచ్చినా పట్టకుండా కోర్టు ధిక్కరణకు పాల్పడుతూ పనులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మానవ రూపంలో దేవుడి బొమ్మ పెట్టరాదని ఒక చట్టం చేసేవరకు తమ పోరాటం ఆగదని కరాటే కళ్యాణి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. మంత్రి పువ్వాడ అజయ్‌కు ఎన్టీఆర్ మీద అభిమానం ఉంటే ఎన్టీఆర్ విగ్రహం పెట్టుకోవాలని, శ్రీకృష్ణుడి మీద అభిమానం ఉంటే కృష్ణుడి విగ్రహం పెట్టుకోవాలి అన్నారు. అయితే యావత్ హిందూ సమాజాన్ని కించపరిచేలా మానవుని రూపం దేవుడి విగ్రహాన్ని పెట్టడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. దేవుని రూపం నువ్వు చూశావా అని ప్రశ్నిస్తున్న కుహనా మేధావులు వారి ముత్తాతలను చూశారా అని వ్యాఖ్యానించారు. వారికి రూపం ఉందో లేదో తెలుసుకోవాలన్నారు. ఇప్పటికైనా వెంటనే పనులు ఆపాలని, విగ్రహాన్ని పూర్తిగా మార్చేయాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేస్తా!



హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ కరపత్రాన్ని ఆవిష్కరించిన అనిల్‌కుమార్‌యాదవ్

చిక్కడపల్లి: సికింద్రాబాద్ జిల్లా పరిధిలోని ఐదు అసెంబ్లీ నియోజవర్గాల్లో కాంగ్రెస్ పార్టీని పూర్తిస్థాయిలో పటిష్టం చేస్తానని నూతనంగా ఎంపికైన జిల్లా అధ్యక్షుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ తెలిపారు. శుక్రవారం గాంధీనగర్ డివిజన్లో అనీల్ కుమార్‌యాదవ్‌ను ముషీరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఆయా నియోజవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ పక్షాన పోటీ చేసే అభ్యర్థులను టీపీసీసీ అధ్యక్షుడుతో సంప్రదింపులు జరిపాకే జరుగుతుందని తెలిపారు. ప్రధానంగా పార్టీని పటిష్టం చేయడమే తన లక్ష్యమని తెలిపారు. అందర్నీ కలుపుకు పోతూ ముందుకు సాగుతానని వెల్లడించారు. జూన్ రెండవ తేదీన రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ జరుగుతుందని తెలిపారు. పోటీలలో ఎవరైనా పాల్గొనవచ్చని, విజేతలకు ఆకర్షనీయమైన బహుమతులు ఉంటాయని తెలిపారు. నియోజవర్గ స్థాయిలో ప్రథమ స్థానంలో వచ్చే మహిళలకు ఎలక్ట్రిక్ స్కూటర్స్ బహుమతి అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు గజ్జెల రిషికేశ్వర్, బి.అనిల్ యాదవ్, కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు శీలం సత్యనారాయణ, అభిషేక్ కెన్నడి, సంఘపాక వెంకట్, ఎంబి కృష్ణయాదవ్, జయ, అంజియాదవ్, మాజీ కార్పొరేటర్ వాజిద్ హుస్సేన్ ఇతరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పైప్‌లైన్ల ఆధునీకరణకు చర్యలు

ముషీరాబాద్: నియోజకవర్గంలో పెరిగిన జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్లను యుద్ధప్రాతిపదికన ఆధునీకరిస్తున్నట్లు ఎమ్మెల్యే ముఠాగోపాల్ తెలిపారు. శుక్రవారం ముషీరాబాద్ డివిజన్‌లోని జెమిస్తాన్‌పూర్ పోస్టాఫీస్ వీధిలో రూ.4.50 లక్షల డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణపనులు, అరుణ కో– ఆపరేటివ్ సొసైటీ వీధిలో రూ.3.80 లక్షలతో డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను డివిజన్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పైప్‌లైన్ పనులు పూర్తయిన వెంటనే రోడ్డు నిర్మాణ పనులను చేపడతామన్నారు. జెమిస్తాన్‌పూర్ పోస్టాఫీసు వీధిలో అస్తవ్యస్తంగా మారిన పైప్‌లైన్‌లను ఆధునీకరించి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ముఠా జైసింహ, నర్సింగ్ ప్రసాద్, శ్రీధర్ రెడ్డి, శివముదిరాజ్, పూసగోరక్‌నాథ్, ప్రశాంత్, సయ్యద్ అహ్మద్ భక్తియార్, బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ నవీన్‌గౌడ్, బద్రినారాయణ, అనిల్‌కుమార్, గడ్డం నవీన్ తదితరులు పాల్గొన్నారు.